సాక్షి అనకాపల్లి

శనివారం ◆ 29 ◆ మార్చి ◆ 2025



జాతర ప్రారంభం IIలో

అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నెల రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఉష్ణోగ్రతలు

అనకాపల్లి

శుక్రవారం

గరిష్ట	కనిష్ట
36.3 డిగ్రీలు	24.3 డిగ్రీలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని	సహర్ ఆది
అనకాపల్లి	6.14	4.38
నర్సీపట్నం	6.17	4.37

న్యూస్‌రీల్

మైనింగ్ మాఫియా పర్యావరణ విధ్వంసం



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పి.వి.ఎస్.ఎన్.రాజు

- రోలుగుంట మండలంలో 14 క్వారీల నిర్వహణలో అవకతవకలు
- ప్రజల భద్రత విషయంలో బాధ్యత లేదు
- రాత్రి సమయాల్లో టిప్పర్ల గోల
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ శాఖలు
- తక్షణం చర్యలు తీసుకోండి
- కలెక్టర్‌కు జనసేన నేత పి.వి.ఎస్.ఎన్.రాజు వినతి -IIలో

1న టెన్త్ సోషల్ పరీక్ష

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31న జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పబ్లిక్ పరీక్షను ఏప్రిల్ ఒకటవ తేదీకి వాయిదా వేశామని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. రంజాన్ పర్వదినం ఈనెల 31న జరిగే అవకాశం ఉన్నందున పరీక్షను మంగళవారం నిర్వహిస్తున్నామని, ఈ మార్పును విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని ఆయన కోరారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



పోలీస్ సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ జరిగింది. ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లాల్లో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై వినతులు స్వీకరించారు. పోలీస్ సిబ్బంది, హోంగార్డులు ఆరోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

ఆక్రమిత భూములకు అడ్డగోలు రోడ్డు

ఇక్కడ ఏదైనా 'అనిత'ర సాధ్యం



- ఏకంగా రూ. 1.77 కోట్లతో రోడ్ల నిర్మాణం రొయ్యల సాగు పేరుతో రైతుల నుంచి లీజుకు..
- అబద్ధాలు చెప్పి ఆపై రైతుల పొలాలు కబ్జా ఈ ఆక్రమిత భూముల్లో పంటల సాగు
- వీటి కోసం కొత్త రోడ్డు ఏర్పాటు హోం మంత్రి అనిత అనుచరుల ఇష్టారాజ్యం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు...ఏ ఊరుకు వెళ్లేది కాదు. దర్గాగా పేదలకు చెందిన భూములను ఆక్రమించి పంటలు సాగవుతున్న పొలాలకు వెళ్లేలా నిర్మిస్తున్నారు. ఉప్పరాపల్లి నుంచి వెంకటాపురం గ్రామానికి రూ.90 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నట్టు ప్రకటించారు. ఈ పనులను వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్నారు. విచిత్రంగా ఈ రోడ్డు పరిధిలో ఏ ఊరూ లేదు... జనమూ లేరు. కేవలం టీడీపీ నేతలు ఆక్రమించి సాగు చేస్తున్న పొలాల కోసం మాత్రమే నిర్మిస్తున్నారు.



ఇది మరో రోడ్డు. రూ. 87.27 లక్షలతో వెంకటాపురం పరిధి నుంచి బంగారమ్మ పాలెం వరకు నిర్మిస్తున్నట్టు ఫలకం ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు కోసం కూడా ఉపాధి హామీ నిధులను వెచ్చిస్తున్నారు. అయితే, విచిత్రంగా ఈ రోడ్డు కూడా బంగారమ్మపాలెం వరకూ ఏర్పాటు చేస్తున్నది కాదు. కేవలం ఆ ఊరు పేరుతో టీడీపీ నేతలు సాగు చేస్తున్న పొలాల కోసం నిర్మిస్తున్నది కావడం గమనార్హం.

ఈ విచిత్రాలు హోం మంత్రి అనిత ప్రాతినిథ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గం ఎస్ .రాయవరం మండలంలో వెలుగు చూశాయి. ఈ రోడ్లను అధికార తెలుగుదేశం పార్టీ మండల నేత, మంత్రి అనుచరుడు ఆక్రమించిన భూములకు వెళ్లేందుకు వేస్తుండటం విమర్శలపాలవుతోంది. హోం మంత్రి నియోజకవర్గంలో రహదారులు ఛిద్రంగా ఉన్నాయి. ప్రజలు కనీసం నడవలేని స్థితిలో ఉంటే..టీడీపీ నేతలు సాగు చేస్తున్న పంట పొలాలు, రొయ్యల చెరువులకు వెళ్లేందుకు మాత్రం లక్షల్లో ఖర్చు చేసి రోడ్లు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఇందుకోసం డ్వామా అధికారులు సైతం కళ్లు మూసుకుని నిధులు మంజూరు చేస్తున్నారు. ఈ విధంగా ప్రైవేటు వ్యక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ రోడ్లకు అయ్యే వ్యయాన్ని ఆయా వ్యక్తుల నుంచే వసూలు చేయాలనే డిమాండ్ స్థానిక ప్రజల నుంచి వినిపిస్తోంది.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

దర్గాగా ఆక్రమణ... ఆపై అధికారిక రోడ్డు



పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలంలోని వాకపాడు రెవెన్యూ పరిధిలో 73, 74, 75, 77, 78, 344, 345, 346, 347, 348, 351, 352, 353, 354, 435, 438, 439, 441, 442, 443, 445 సర్వే నంబర్లకు చెందిన సుమారు 103 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూములకు దాదాపు సుమారు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇదే గ్రామాలకు చెందిన పలువురు రైతుల పేరుతో డీ-ఫారం పట్టాలు మంజూరు చేసింది. అప్పటినుంచి సదరు రైతులు ఈ భూములను సాగుచేసుకుంటున్నారు. ఈ భూములపై కన్నేసిన స్థానిక టీడీపీ నేత...రొయ్యల చెరువుల పేరుతో చేజిక్కించుకునేందుకు స్కెచ్ వేశారు. ఆక్వా సాగు చేసి వచ్చిన లాభాల్లో మీకు వాటాలు పంచుతానంటూ 'అబద్ధాలు' చెప్పి పదేళ్ల క్రితం సదరు టీడీపీ నేత లీజుకు తీసుకున్నారు. పేదలైన వీరంతా అతనికి లీజుకు ఇచ్చారు. దీన్ని ఆసరాగా తీసుకుని 103 ఎకరాల ప్రభుత్వ భూములను 2012 ఏప్రిల్ 10వ తేదీన 42 సబ్ డివిజన్లుగా విభజించి ఈ ప్రాంతానికి ఎటువంటి సంబంధం లేని వ్యక్తి జగన్‌మోహన్‌రావు తండ్రి వీరభద్రరావును తెరమీదకు తీసుకు వచ్చి అతని పేరున మ్యూటేషన్ (వెబ్‌ల్యాండ్‌లో) నమోదు చేశారు. ఈ 42 సబ్‌డివిజన్లకు 42 ఖాతా నంబర్లు ఇచ్చారు. సదరు రైతులు తమకు లీజు మొత్తం ఇవ్వాలని లేదంటే భూములు వెనక్కి ఇవ్వాలని కోరుతున్నారు. అసలు మీ భూములు ఎక్కడ అని ఎదురు ప్రశ్నించడంతో రైతులు గొల్లుమంటున్నారు. అంతేకాకుండా తిరిగి ఇప్పుడు మంత్రి పేరు చెప్పి బెదిరించి కేసులు కూడా పెట్టిస్తున్నారు. పదేళ్లుగా వరి సాగు చేస్తూ... ఏటా 3 వేల బస్తాల ధాన్యం పండిస్తున్నారు. తమకు మాత్రం ఒక్క గింజ కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. దళితులకు చెందిన ఈ భూములు ఉన్న ప్రాంతాలకు పక్కనే ఆక్వా సాగు జరుగుతోంది. ఆక్వా సాగుకు అవకాశం ఉన్న భూములు కావడంతో మార్కెట్లో ధర కూడా బాగానే ఉంది. 103 ఎకరాల ఈ భూమి విలువ రూ.50 కోట్ల మేరకు ఉంటుందని తెలుస్తోంది. సదరు టీడీపీ నేత సాగు చేస్తున్న పంట పొలాలతోపాటు పక్కనే ఇతర నేతలు ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులకు వెళ్లేందుకు మాత్రమే ఈ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రావెల్ తరలింపు

ఇక ఈ రోడ్డు నిర్మాణ పనులను కూడా మంత్రి అనుచరులే చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనుల్లో ఉపయోగించే గ్రావెల్ మొత్తాన్ని అక్రమంగా తరలించారనే ఆరోపణలున్నాయి. ఈ నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న వాహనాలు కూడా సదరు పార్టీ మండల నేతకు చెందినవే. అక్కడ ఉన్న మట్టిని తన ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించిన రోడ్డు నిర్మాణ పనుల్లో ఉపయోగించారు.

అక్రమ భూముల్లో రొయ్యల సాగు

పాయకరావుపేట నియోజకవర్గం ఎస్ .రాయవరం మండలంలో ఇష్టారాజ్యంగా రొయ్యలు, చేపల చెరువులను ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ఏకంగా ప్రభుత్వ భూముల్లోనే రొయ్యల చెరువుల సాగు జరుగుతోంది. ఈ భూములన్నీ గతంలో అనిత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆమె పేరుతో అనుచరులు ఆక్రమించుకున్నవి కావడం గమనార్హం. ఇప్పుడు అదే భూముల్లో ఏకంగా రొయ్యల చెరువులను తవ్వేస్తున్నారు. ఇందుకోసం మత్స్యశాఖ నుంచి ఎటువంటి అనుమతులు ఉండటం లేదు. పైగా ఏర్పాటు చేస్తున్నవన్నీ పేద దళితుల నుంచి ఆక్రమించుకున్న భూములు, ప్రభుత్వ భూములే ఉంటున్నాయి. అయినప్పటికీ అటువైపుగా రెవెన్యూ యంత్రాంగం కానీ, మత్స్యశాఖ అధికారులు కానీ కన్నెత్తి చూడటం లేదు. వీటిపై ఎవరైనా స్థానిక నేతలు, ప్రజలు ఫిర్యాదు చేస్తే వారికి బెదిరింపులు వస్తున్నాయి. మీ అంతు చూస్తామని బెదిరించడంతో పాటు తిరిగి వారిపైనే కేసులు పెడుతున్నారు. దీంతో చేసేదేమీ లేక మిన్నకుండిపోతున్నారు. మరి కొందరు మాత్రం నేరుగా అమరావతికి వెళ్లి మరీ ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం ఉండటం లేదు.

ఏసీబీ వలలో నక్కపల్లి ఆర్ఐ

- వ్యవసాయ బోరు అనుమతి కోసం రూ.12 వేలు డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్ఐ కన్నబాబు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమ్య

నక్కపల్లి: వ్యవసాయ బోరు అనుమతి మంజూరుకు రూ.12 వేలు లంచం డిమాండ్ చేసిన నక్కపల్లి ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ఎం.కన్నబాబు ఏసీబీకి చిక్కారు. తహసీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఆయనను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఎస్.రమ్య తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు తన పొలంలో మూడు వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. బోరు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలంటే ఒక్కొక్క దరఖాస్తుకు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.15 వేలు ఇవ్వాలని ఇన్‌చార్జ్ ఆర్ఐ కన్నబాబు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనంటూ బాధితుడు ఆర్ఐతో రూ.12 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ విషయాన్ని బాధిత రైతు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆర్ఐతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు తహసీల్దార్ కార్యాలయంలో రూ.12 వేలు నగదు అందిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆర్ఐపై కేసు నమోదు చేశామన్నారు. శనివారం రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు మధ్యాహ్నం 3 గంటలకు వరకు ఆర్ఐని విచారించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై మరింత లోతుగా విచారించినట్లు సమాచారం. విచారణ సమయంలో కార్యాలయంలోకి ఎవరినీ రానివ్వలేదు. ఈ దాడుల్లో సీఐలు వై.కె.కిషోర్ కుమార్, సీహెచ్ లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు, బి.సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి రెవెన్యూలో కృష్ణ లీలలు

స్థానిక తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఏడాదిన్నర నుంచి ఈ కార్యాలయంలో ఒక ప్రైవేటు వ్యక్తి హవా కొనసాగుతోంది. ఈ బ్రోకర్ చెప్పిందే వేదమని, శ్రీకృష్ణ భగవానుడి గీతా బోధలా ఆయన చెప్పినట్టే రెవెన్యూ సిబ్బంది నడుచుకుంటారని, అందుకు వారికి బాగానే మామూళ్లు అందుతున్నాయన్న విమర్శ ఉంది. ఇతనితోపాటు మెరక గ్రామాల్లో పనిచేస్తున్న ఒక వీఆర్వో కూడా ఇదే పంథాను కొనసాగిస్తున్నాడు. తనకు సంబంధం లేని గ్రామాల మ్యుటేషన్లను కూడా ఇతనే పూర్తిచేస్తాడు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. నక్కపల్లి రెవెన్యూ చరిత్రలో ఉద్యోగి ఏసీబీ అధికారులకు పట్టుబడటం ఇదే తొలిసారి. శుక్రవారం పట్టుబడిన కేసును మించిన పెద్ద పెద్ద అవినీతి పనులెన్నో గతంలో జరిగాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో ఏడాది క్రితం వరకు పనిచేసిన పెద్ద పెద్ద తిమింగలాలు కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడం, వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయడం, డీ ఫారం, సాగులో ఉన్న భూములకు ఏపీఐఐసీ నుంచి నష్టపరిహారం చెల్లించడం కోసం సిఫార్సులు చేయడం వంటి కార్యకలాపాలెన్నో అడ్డగోలుగా చేశారన్న ప్రచారం జరుగుతోంది. గత రెండేళ్ల నుంచి కార్యాలయంలో మ్యుటేషన్లు, ఏపీఐఐసీ నష్టపరిహారం చెల్లింపుల ఫైళ్లు, పేమెంట్లను, జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలిస్తే లబ్ధి పొందిన వారి నుంచి ఎంతెంత దండుకున్నారో తెలుస్తుందంటున్నారు.

ట్రాన్స్‌కో సిబ్బంది గుండెల్లో గుబులు!

ఏసీబీ దాడి వార్త తెలియడంతో కొంతమంది ట్రాన్స్‌కో సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. వ్యవసాయ బోరు కోసం రెవెన్యూ శా ఎన్‌వోసీ ఇచ్చిన తర్వాత ట్రాన్స్‌కో వారు లైను వేసి కనెక్షన్ ఇచ్చి మీటరు ఏర్పాటు చేస్తారు. దీనికోసం వారు రైతుల నుంచి వేలాది రూపాయలు గుంజుతున్నారు. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో ఈ అవినీతి పరాకాష్టకు చేరుకుంది. శుక్రవారం నక్కపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నారన్న సమాచారంతో ఈ రెండు మండలాల్లో ట్రాన్స్‌కో సిబ్బంది కార్యాలయాలు మూసిసి దరిదాపుల్లో కనిపించలేదని సమాచారం.

పట్టణాల్లో దాహం.. దాహం

ప్ర'జల' కష్టాలు అన్నీ ఇన్నీ కావు

- తాగునీటి పథకాల నిర్వహణకు నిధుల కేటాయింపు నిల్
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నీటి వృథా
- శిథిలమైన వాటర్ పైప్‌లైన్లు, చేతి బోర్లు
- అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నంలలో తీవ్ర నీటి సమస్య



సాక్షి, అనకాపల్లి/నర్సీపట్నం/యలమంచిలి/చోడవరం/అనకాపల్లి టౌన్: వేసవిలో మండుతున్న ఎండలకు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, చోడవరం తదితర అర్బన్ ప్రాంత ప్రజలు తాగునీటి సమస్య తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. వేసవి నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం, శిథిలమైన వాటర్ పైప్‌లైన్లు, చేతి బోర్లు, వాటర్ కుళాయిలకు అధికారులు మరమ్మతులు చేయించకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండలు తీవ్రంగా ఉండడంతో చాలాచోట్ల నదుల్లో నీరు అడుగంటింది. రక్షిత నీటి పథకాలకు ప్రభుత్వం మెయింటెనెన్స్ నిధులు కేటాయించకపోవడంతో వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. దీనికితోడు జల్‌జీవన్ మిషన్ పనులు కూడా పూర్తి కాకపోవడంతో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. పూర్తిస్థాయిలో బోర్లు కూడా పనిచేయడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఇక ముందు వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్ర'జల' కష్టాలపై సంబంధిత అధికారులు తగిన విధంగా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు.



అనకాపల్లి పట్టణంలో నీటి కష్టాలు

నర్సీపట్నంలో సగానికి సగం కోత

నర్సీపట్నంలో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగా ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం అప్పటి జనాభాకు తగ్గట్టుగా ఉత్తరవాహిని నది దుగ్గాడ వద్ద తాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పట్టణ జనాభా సుమారు 75 వేలకు పెరిగినప్పటికీ, తాగునీటి ప్రాజెక్టు సామర్థ్యం పెరగలేదు. కుళాయిల నుంచి ఒక్కొక్కసారి బురదనీరు రావటం వల్ల కుళాయిలకు క్లాత్ కట్టి నీటిని పట్టుకుంటున్నారు. చేతిపంపుల ద్వారా గృహ అవసరాలను తీర్చుకుంటున్నారు. క్రమం తప్పకుండా నీటిని సరఫరా చేసినప్పటికీ, గంట మాత్రమే వదులుతుండడంతో పూర్తిస్థాయిలో నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మేజర్ పైపులైన్లకు లీకులు ఏర్పడి తాగునీరు వృథా అవుతోంది. వీధుల్లోని పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు లేక వృథాగా పోతుంది. పట్టణంలో ప్రైవేటు, వీధి కుళాయిలు 1082 వరకు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ రోజుకు 80 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవంగా 30 లీటర్ల నీటినే అందిస్తున్నారు. పట్టణ జనాభా మొత్తానికి 9 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 4.06 ఎంఎల్‌డీ నీటిని ఇస్తున్నారు.



నర్సీపట్నంలో కుళాయిలకు ట్యాప్‌లు లేక వృథాగా పోతున్న తాగునీరు

అనకాపల్లిలో నీటి వృథా

అనకాపల్లి పట్టణ పరిధిలో సుమారు లక్ష మంది జనాభా నివసిస్తున్నారు. ఆరు పెద్ద వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా ఇంటింటికీ, వీధి కుళాయిల ద్వారా సుమారు 60 లక్షల లీటర్ల నీటి సరఫరా జరుగుతుంది. గతంలో ప్రజల అవసరాలకు తగ్గట్టు రెండు పూటలా సరఫరా చేసేవారు. వేసవి ప్రారంభమయ్యాక కొన్ని రోజులుగా ఉదయం 6.45 గంటల నుంచి 7.30 గంటల వరకు ముప్పావు గంట మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజల దాహార్తిని తీర్చుకునేందుకు సరఫరా చేస్తున్న మంచినీరు సరిపోవటం లేదు. పట్టణంలో 420 చేతి బోర్లు ఉన్నాయి. కొన్నిచోట్ల వీధి కుళాయిలకు హెడ్స్ లేవు. దీంతో కుళాయిల నుంచి నీరు వృథాగా పోతుంది. అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదు.

చోడవరంలో నీటి ఎద్దడి

రోజు తప్పి రోజు.. ఇంటికి రెండు బిందెలే..

చోడవరం పట్టణంలో పలు ప్రాంతాలను మంచినీటి సమస్య వేధిస్తోంది. తామరచెరువు సమీపంలో ఉన్న పంప్ హౌస్‌లో నీటిమట్టాలు తగ్గిపోవడంతో చోడవరం పట్టణంలో తామరచెరువువీధి, వెలమవీధి, సకురువీధి, అన్నవరం వీధి ప్రాంతాల్లో ట్యాంక్‌లకు రోజూ సరిపడే నీరు పంపింగ్ జరగడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో రోజు తప్పించి రోజు పబ్లిక్ కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నారు.

జల్‌జీవన్ మిషన్ పథకంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 5941 ఇంటింటి కుళాయిలు ఇచ్చారు. కందర్పకాలనీ, అన్నవరం ప్రాంతాల్లో ఇంకా 400 ఇళ్లకు కుళాయిలు ఇవ్వాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకూ కదలిక లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉంది. ఒక్కొక్క ఇంటికి రెండు బిందెలు నీరు కూడా రావడం లేదు.



సకురు వీధిలో రోజు తప్పించి రోజు నీరు రావడంతో కుళాయిల వద్ద పేరుకుపోయిన బిందెలు

నెలకు వారం రోజులు అంతరాయం

- యలమంచిలిలో కాలం చెల్లిన నీటి పథకం

యలమంచిలికి ఎస్.రాయవరం మండలం సోమిదేవిపల్లి (వరాహనది) వద్ద నిర్మించిన సమగ్రనీటి రక్షిత పథకమే ఆధారం. 23 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పథకం కావడంతో తరుచూ మరమ్మతులకు గురవుతోంది. నెలలో వారం రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. తులసీనగర్‌లో తాగునీటి కొరత మరీ ఎక్కువగా ఉంది. ఇక్కడ రెండు రోజులకొకసారి నీటి సరఫరా జరుగుతోంది. టిడ్కో గృహసముదాయం, నెహ్రూనగర్, షేనుకొండకాలనీ, రామచంద్రమ్మ గుడి ప్రాంతాలకు నీటి సరఫరాలో తరుచూ విఘాతం ఏర్పడుతుంది. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.101 కోట్లతో ప్రారంభించిన నీటి సరఫరా పథకం పనులను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయి.



తులసీనగర్‌లో పబ్లిక్ కుళాయి వద్ద రద్దీ

క్లుప్తంగా

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురండి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీవో శిరీషారాణి

గొలుగొండ: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని గుండుపాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యకర వాతావరణం నెలకొనేందుకు అందరి సహకారం అవసరమన్నారు. పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పన్నులను శతశాతం వసూళ్లు చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మూర్తి, ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసు, కార్యదర్శి బి.కిరణ్మయి పాల్గొన్నారు.

నేటి సాయంత్రం నూకాంబిక దర్శనాల నిలిపివేత

అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని శనివారం సాయంత్రం దర్శనాలు నిలిపివేస్తున్నట్టు ఆలయ ఈవో వెంపల రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిమిత్తం సాయంత్రం 4.30 నుంచి దర్శనాలు నిలిపివేస్తున్నామని, ఆదివారం ఉదయం 5 గంటల నుంచి యథావిధిగా భక్తులకు అమ్మవారి దర్శనం లభిస్తుందన్నారు.

నేడు మహా బడ్జెట్

- సమావేశంపై సందిగ్ధత
- కోరం సరిపడేలా సభ్యులు హాజరవుతారా?
- అందరి దృష్టికి జీవీఎంసీ వైపే..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 2025–26 ప్రత్యేక బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం సాగనుంది. ఈ వార్షిక బడ్జెట్‌ను జీవీఎంసీ స్థాయి సంఘం ఆమోద ముద్ర డిసెంబర్‌లో వేసింది. 2025–26 వార్షిక బడ్జెట్ ప్రారంభపు నిల్వ రూ.482.26 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.427.96 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.476.18 కోట్లు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.460.14 కోట్లు. ముగింపు నిల్వగా రూ.16.04 కోట్లుగా చూపారు.

ఇదిలా ఉండగా బడ్జెట్ ఆమోదం పొందుతుందా? లేదా? అనేది తర్జన భర్జనలు సాగుతున్నాయి. ఓ వైపు మేయర్‌పై అవిశ్వాసం పెడతామంటూ సంఖ్యా బలం లేనప్పటికీ కూటమి కార్పొరేటర్లు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీకి చెందిన కొంత మంది కార్పొరేటర్లను ప్రలోభాలు పెట్టి లొంగదీసుకున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశానికి వస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

కోరం ఉండాల్సిందే..

బడ్జెట్ ఆమోదం పొందాలంటే మూడో వంతు సభ్యులు హాజరు కావాలి. అంటే 34 మంది సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలి.

16,17,19 తేదీలో అవిశ్వాసం?

ఇదిలా ఉండగా మేయర్ పీఠం దక్కించుకునేందుకు కూటమి నేతలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. నేరుగా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వారం రోజుల క్రితం అవిశ్వాసం కోరుతూ వినతి పత్రం అందజేశారు. వచ్చే నెల 16, 17, 19 తేదీల్లో అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం.



అవిశ్వాసంపై యాదవుల్లో లుకలుకలు

యాదవ సామాజిక వర్గానికి చెందిన మేయర్ హరి వెంకటకుమారిపై అవిశ్వాసానికి కూటమి నేతలు ప్రయత్నిస్తుండడంతో పలువురు యాదవ కులస్తుల్లో లుకలుకలు ప్రారంభమయ్యాయి. యాదవ కులానికి చెందిన మేయర్‌ను కాదని ఇంకెవరికైనా మేయర్ పదవి ఇస్తే..ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. అంతేగాక పలువురు టీడీపీకి చెందిన యాదవ కులస్తుల కార్పొరేటర్లు మేయర్‌గా హరి వెంకటకుమారినే కోరుకుంటున్నట్టు సమాచారం.

సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ భారం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం
- చార్జీలు తగ్గించాలని అనకాపల్లిలో నిరసన ర్యాలీ

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత దశల వారీగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై ఎనలేని భారం మోపారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి పట్టణంలో నెహ్రూచౌక్ వరకూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రజలపై ఎప్పుడూ ఏదో రకంగా భారాలు మోపడం అలవాటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో రూ.15,485 కోట్ల అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. సెకీ ద్వారా అదానితో జరిగిన విద్యుత్ ఒప్పందాలను ఏపీ ఈఆర్సీ ఖరారు చేసిందని, ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా అదానీ అవినీతి బట్టబయలై, ఆ ఒప్పందాలను పలు రాష్ట్రాలు, దేశాలు తిరస్కరించి వెనక్కు పంపిస్తున్న నేపథ్యంలో మన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి దానికి ఆమోదముద్ర వేయడం అవినీతికి ఆమోదం తెలపటమేనని ఆయన విమర్శించారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షునిగా లోకనాథం ఎన్నిక

అనకాపల్లి: సీఐటీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె.లోకనాథం, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శంకరరావు, కోశాధికారిగా వి.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, జి.దేవుడునాయుడు, పరమేశ్వరరావు కార్యదర్శులుగా జి.వరలక్ష్మి, ఎ.రాజు, బి.చంద్రశేఖర్, వి.సత్యవతి, త్రినాథరావులు ఎన్నికయ్యారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఎన్నికలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని లోకనాథం పిలుపునిచ్చారు.

వడ దెబ్బకు మహిళా రైతు మృతి



కిల్లి కాసమ్మ (ఫైల్)

దేవరాపల్లి: వడ దెబ్బకు గురై మహిళా రైతు మృతి చెందిన హృదయ విదారక ఘటన దేవరాపల్లి మండలం తారువలో శుక్రవారం చోటు చేసుకుంది. తారువ గ్రామానికి చెందిన కిల్లి కాసమ్మ (59) తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ఉదయం 11:30 ప్రాంతంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వడ దెబ్బకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే కుటుంబీకులు, స్థానిక రైతులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. ఈ లోగా అపస్మారక స్థితికి చేరుకున్న సదరు మహిళా రైతును చేతులపై ఎత్తుకొని గ్రామంలోకి తీసుకువచ్చారు. అనంతరం 108 వాహనంలో కె.కోటపాడు ఆస్పత్రికి తీసుకెళ్లగా స్థానిక వైద్యులు పరీక్షలు చేసి మృతి చెందినట్లు నిర్ధారించారని కుటుంబీకులు తెలిపారు. మృతురాలి భర్త కిల్లి పెదరమణ ఇదివరకే మృతి చెందగా, అవివాహితుడైన కుమారుడు శ్రీను ఉన్నాడు. కాసమ్మ మృతదేహం వద్ద మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు నివాళులర్పించి సంతాపం వెలిబుచ్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

మైనింగ్ మాఫియా పర్యావరణ విధ్వంసం

- రోలుగుంట మండలంలో క్వారీల నిర్వహణలో అవకతవకలు
- కలెక్టర్‌కు జనసేన నేత పి.వి.ఎస్.ఎన్.రాజు వినతి

తుమ్మపాల: చోడవరం నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా విచ్చలవిడి తవ్వకాలు చేపడుతూ పర్యావరణ విధ్వంసం సృష్టిస్తోందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ చోడవరం జనసేన పార్టీ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు శుక్రవారం కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోలుగుంట మండలంలోని 14 మైనింగ్ క్వారీలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా పరిసర గ్రామాలలో పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ, ప్రజల భద్రత పట్ల ఎటువంటి బాధ్యత లేని విధంగా వ్యవహరిస్తున్నట్టు స్పష్టమైందన్నారు. రోలుగుంట గ్రామంలో ఆరు క్వారీలు, నిండుగొండ, కె.నాయుడుపాలెం మధ్య ఒకటి, కొవ్వూరు సమీపంలో మూడు, నందిపురం గ్రామంలో రెండు, వడ్డిప గ్రామంలో ఒకటి, రాజన్నపేట గ్రామంలో ఒక క్వారీ.. మొత్తం 14 క్వారీల్లో ఇష్టారీతిలో మైనింగ్ దోపిడీ చేస్తున్నారని, ఈ క్వారీలకు కనీసం సరిహద్దు గుర్తింపు కూడా లేకపోవడం దారుణమన్నారు. రాత్రి సమయాల్లో క్వారీల నిర్వాహణ, టిప్పర్ల రాకపోకలతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఈ సమస్యను తగ్గించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ప్రాంతీయ రవాణా కార్యాలయం వంటి విభాగాలు ఈ ఉల్లంఘనలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రాజన్నపేట గ్రామంలో ఒక లీజుదారుడు వ్యవసాయ చెరువు పరీవాహక ప్రాంతం మధ్యలో పొడవైన వెడల్పాటి రహదారిని నిర్మిస్తున్నారని, ఇది రైతుల సాగు నీటిసరఫరాకు తీవ్ర ముప్పు కలిగిస్తుందన్నారు. సమీపంలోని వ్యవసాయ భూములు కూడా మైనింగ్ కార్యకలాపాల వల్ల దెబ్బతింటున్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఏడు కంటే ఎక్కువ క్వారీలు తమ లీజులను పునరుద్ధరించకుండానే చట్ట విరుద్ధంగా నడుస్తున్నాయని చెప్పారు. మైనింగ్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ, నీటిపారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణం, రవాణా శాఖల ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఒకటో తేదీనే సామాజిక పింఛన్ల పంపిణీ

తుమ్మపాల: జిల్లాలో 'పేదల సేవలో'భాగంగా వచ్చే నెల 1న ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి, మొదటి రోజే శత శాతం పంపిణీకి చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. పింఛన్లు, ఉపాధి హామీ, పలు అంశాలపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, మండల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకుల సెలవుల నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి అవసరమైన డబ్బులను ముందుగానే తీసుకుని, సంబంధిత మండల పోలీసు స్టేషన్‌లో భద్రపరచాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మంజూరైన రోడ్డు పనులను పూర్తిచేసి ఉగాది రోజున ప్రారంభించాలని ఆమె చెప్పారు. వేసవి దృష్ట్యా పశువులకు తాగునీటి సౌకర్యం కోసం అనువైన స్థలాల్లో తొట్టెలు నిర్మించాలన్నారు. జిల్లాలో 3,403 పంట గుంతలను మంజూరయ్యాయని, వాటికి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేకేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, డీఆర్డీ పీడీ కె.శచీదేవి, డ్వామా పీడీ బి.పూర్ణమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతరకు రాష్ట్ర పండగ హోదా

సాక్షి, అనకాపల్లి: గవరపాలెంలో ఉన్న నూకాంబిక అమ్మవారి జాతరకు రాష్ట్ర పండగ హోదా కల్పించారు. ఈ మేరకు దేవదాయ శాఖ సెక్రటరీ వి.వినయచంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నెల 28 నుంచి వచ్చే నెల 27 వరకు కొత్త అమావాస్య జాతర జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



చీడికాడ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

చీడికాడ: చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఈవో జి.అప్పారావునాయుడు సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం చీడికాడలోని ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. పలువురు విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి వారితో మాట్లాడారు. శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.

సారా తయారీ, అమ్మకాలు అరికట్టాలి

పాయకరావుపేట: నాటు సారా తయారీ, అమ్మకాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. నవోదయం 2.0లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ నాటు సారా నివారణకు తగు సూచనలు, సలహాలు అందించారు. నవోదయం 2.0 కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నాటు సారా, గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సుర్జిత్ సింగ్, జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ వి.సుధీర్, సీఐ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి జాతర ప్రారంభం





నూకాంబిక అమ్మవారు, అమ్మవారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి జాతరను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం కొత్త అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారికి తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించనున్నారు. పలు సంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు, కేరళా వాయిద్యాలు భక్తులను ఎంతగానో అకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వెంపల రాంబాబు, పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

జాతరకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు

ప్రశాంతమైన వాతావరణంలో నెల రోజుల పాటు నూకాంబిక అమ్మవారి ఆలయ పండగను నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయనకు ఆలయ ఈవో వెంపల రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

దేవరాపల్లిలో 15 అడుగుల భారీ శ్వేత నాగు



దేవరాపల్లి శివారు పంట పొలాల్లో సంచరిస్తున్న శ్వేత నాగు

దేవరాపల్లి: దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల వారి కల్లాలు సమీపంలోని పొలాల్లో సుమారు 15 అడుగుల పొడవున్న భారీ శ్వేత నాగు శుక్రవారం సాయంత్రం స్థానిక రైతులను హడలెత్తించింది. పొలంలో పామును చూసిన కుక్కలు వెంబడిస్తుండగా బుసలు కొడుతున్న శ్వేత నాగును చూసిన స్థానిక పరుగులు తీశారు. పాము పక్కనే ఉన్న సరుగుడు తోటలోకి వెళ్లడంతో స్థానికులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. ఈలోగా నాగుపాము ఒక్కసారిగా పడగ విప్పి బుసలు కొడుతూ రైతులను కాటేసేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి భయంతో పరుగులు తీశారు. వెంటనే పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లిపోయింది.

బెల్లం మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు



మార్కెట్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి పట్టణంలో బెల్లం మార్కెట్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. మార్కెట్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న షెడ్లు, గోదాముల వివరాలు, ప్రస్తుతం వినియోగిస్తున్న వాటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. బెల్లం తయారీ విధానం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొత్తూరులోని డంపింగ్ యార్డ్ స్థలం, చెరువును పరిశీలించారు. చెరువు సర్వే చేసి ఆక్రమణల వివరాలను నివేదించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

గొలుగొండ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత కనిపించకుండాపోయింది. ఎస్ఐ రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలిక మల్లవరం గ్రామానికి చెందిన యువతి ఈ నెల 26వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లల్లో సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె భర్త రాము ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అట్రాసిటీ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

పాయకరావుపేట: మండలంలో పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విశాఖపట్నంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష విధించినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. 2018 నవంబర్‌లో ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించిన కేసులో విశాఖపట్నం ఓపెన్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. నిందితుడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.25 వేలు విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించనిపక్షంలో 2 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

ఖరీఫ్‌కు సకాలంలో విత్తనాలు అందించాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలను రైతులకు సకాలంలో అందించేందుకు ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగాది తర్వాత ఏరువాక ప్రారంభమయ్యే సమయానికి విత్తనాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ ప్రాంత రైతులకు అవసరమైన ఆర్‌జీఎల్, సాంబమసూరి రకాలను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం సమగ్రశిక్ష అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలకు నూతన భవనాల కోసం రూ.1.20 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. మాకవరపాలెం, ఈ కార్యక్రమంలో ఏడీపీ శ్రీదేవి, ఏవో అప్పారావు, సమగ్ర శిక్ష అధికారులు డీఈ సుబ్బలక్ష్మి, నరసింహారావు, ఏఈ రమణాజీ పాల్గొన్నారు.

ఈ ఏడాది 1.27 కోట్ల పనిదినాలు లక్ష్యం

మాకవరపాలెం: జిల్లాలో 2025–26 ఏడాదిలో 1.27 కోట్ల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా నిర్ణయించామని డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పశువులకు తాగునీటి తొట్టెలు, ప్రతి పంచాయతీలో 25 పంట కుంటలు నిర్మాణం చేస్తామన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా రత్నకుమారి



అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా అంట్యాకుల రత్నకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా రామ్ చరణ్ జన్మదిన వేడుకలు

కశింకోట: చింతలపాలెంలో సినీ నటుడు రామ్ చరణ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకినాయుడు, జనసేన నాయకుడు మరపురెడ్డి గిరాబాబు, మెగా యూత్ ప్రతినిధులు తిర్రి సురేష్, సియ్యాద్రి చిట్టిబాబు, బుదిరెడ్డి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి కృషి

కశింకోట: కల్యాణ మండపం (షాదీఖానా) నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక నూరి మసీదు వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లిం పిల్లలకు ఉర్దూ రెసిడెన్సియల్ స్కూలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్, నూరి మసీదు కమిటీ కార్యదర్శి ఎస్ఎంఎం అలీ, ముస్లిం నాయకుడు బాబార్, ముస్లిం పెద్దలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రంజాన్ మాసం 27వ రోజు అతి పవిత్రమైనది భావిస్తూ ముస్లింలు గురువారం రాత్రి జాగరణ కార్యక్రమం నిర్వహించారు.

విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్లు





విక్రయాల కోసం ఆటోలో మంచినీటిని తరలిస్తున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులు

తుమ్మపాల: విచ్చలవిడిగా వెలుస్తున్న నీటి శుద్ధి కేంద్రాలు(ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల)పై అధికారుల నిఘా కరువైంది. దీంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్(బీఐఎస్) నిబంధనలు పాటించకుండా మినరల్ వాటర్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. కొన్నిచోట్ల అపరిశుభ్రమైన నీరు వస్తోంది. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే నీటి వ్యాపారానికి కళ్లెం వేయాల్సిన స్థానిక సంస్థలు, ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడా కానరావడం లేదు.

- మండలంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ నిర్లక్ష్యం వల్ల ప్రజలు తాగేందుకు మంచినీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలో 32 గ్రామాల్లోను శివారు కాలనీలుగా ఉన్న ప్రాంతాల్లో నీటి సౌకర్యం లేక ప్రజలు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వేసవి రావడంతో మరింత నీటి కొరత ఏర్పడింది. దీంతో ప్రజలు డబ్బాలు, డ్రమ్ముల లెక్కన నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో వాటర్ ప్లాంట్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. నీటి సౌకర్యం కల్పించడంతో అధికారుల నిర్లక్ష్యం వ్యాపారులకు బంగారు సిరులుగా మారింది. అరకొర నీటి సరఫరాతో ఇబ్బందులు పడలేక మినరల్ వాటర్‌ను అలవాటు చేసుకుని వాటర్ ప్లాంట్లకు రెగ్యులర్ ఖాతాదారులుగా మారిపోతున్నారు. లీటర్ పాల ధరకు సమానంగా నీటి ధరలు కూడా మార్కెట్‌లో ఏర్పడ్డాయి.

● సుజల స్రవంతి ప్రాజెక్టు నీరెక్కడ....

మండలంలో సంపతిపురం గ్రామంలో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన సుజల స్రవంతి మంచినీటి ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. పదేళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టు కనీసం పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు నీరందించకపోవడంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మినరల్ వాటర్ రూ.20కే అందిస్తామని వాగ్దానాలు చేసిన పాలకులు దాన్ని పూర్తిగా మర్చిపోయారు. దీంతో మండలంలో వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

● నిబంధనలు ఇవీ....

- గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పంచాయతీ అనుమతి తప్పనిసరి.
- ఐఎస్ఐ గుర్తింపు పొంది ఉండాలి.
- పరిశ్రమల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి.
- ప్లాంట్‌లో మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్, టెక్నీషియన్లు ఉండాలి.
- రోజూ నీటి పరీక్షలు చేసి రికార్డ్ నమోదు చేయాలి.
- ప్రతి నెలా రికార్డులను అధికారుల వద్ద నిర్ధారణ చేసుకోవాలి.

ఇలాంటి అనుమతులు పొందకుండా కొనసాగుతున్నవి మండలంలో సగానికి పైగా ఉన్నాయి. వీటిపై చర్యలు తీసుకునే తీరిక లేక అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు.

● వాటర్ ప్లాంట్ల దోపిడీ...

మండలంలో కొందరు మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు కనీస నిబంధనలు కూడా పాటించకుండా ఇష్టారీతిలో నీటి విక్రయాలు చేస్తున్నారు. మినరల్ వాటర్ పేరుతో సాధారణ వాటర్‌ను సరఫరా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు సీజనల్ మామూళ్లు చెల్లిస్తూ వాటర్ ప్లాంట్‌ల వైపు కన్నెత్తి చూడకుండా చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల బోరు వాటర్‌ను ప్లాస్టిక్ ట్యాంక్‌లకు నింపి ఆటోలతో రవాణా చేస్తు కాలనీలు, హోటళ్లు, బడ్డీలకు డ్రమ్ము రూ.200 లెక్కన నీటిని అమ్ముతున్నారు. వాటర్ ప్లాంట్‌ల వద్ద తప్పనిసరిగా ఉండాల్సిన ఐఎస్ఐ గుర్తింపుతో పాటు మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్, టెక్నీషియన్లు ఎక్కడా కనబడటం లేదు. 20 లీటర్ల కూలింగ్ వాటర్ డబ్బా రూ.50, సాధారణ నీటి డబ్బా రూ.15 వసూలు చేస్తున్నారు. ఒక్కో వాటర్ ప్లాంట్ రోజుకు వెయ్యి లీటర్లకు పైగా నీటిని విక్రయిస్తు భారీగానే సంపాదిస్తున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 5,290 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
స్పెషల్ రకం	3,700	4,260
మొదటి రకం	3,610	4.400
రెండో రకం	3,150	3,820
మూడో రకం	2,860	3,120

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
పర్తిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: ఎల్2: ఎంపురాన్ (లూజిఫర్-2)
వెంకటేశ్వర	: షణ్ముఖ
శ్రీసత్య	సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉన్నత స్థాయి



దేవికిరణ్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

అనకాపల్లి టౌన్: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని హ్యాపీ పే సంస్థ సీఈవో ఫౌండర్ కాసిరెడ్డి దేవికిరణ్ తెలిపారు. స్థానిక డైట్ కళాశాలలో స్టార్టప్ ఎలా ప్రారంభించాలి అంశంపై ఐసీటీ అకాడమీ సహకారంతో పవర్ పాయింట్ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చిన్న వ్యాపారం సరైన వ్యూహంతో నడిపితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. భవిష్యత్‌లో టెస్లా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలమీద అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్టార్టప్‌లు ఎంతో ముఖ్యమైనవన్నారు. కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావు, డాక్టర్ కే సజాత తదితరులు పాల్గొన్నారు.

'దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి'

అనకాపల్లి టౌన్: మండలంలోని ఉడేరు పంచాయతీ అల్లిఖానుడు పాలెం గ్రామాన్ని జిల్లా జైభీమ్ సేన జిల్లా అధ్యక్షుడు రేబాక మధుబాబు శుక్రవారం సందర్శించారు. ఈ నెల 20న జరిగిన పండుగ సందర్భంగా గూనూరు అప్పారావు, గూనూరు నాగరాజు, గూనూరు లక్ష్మి భర్త కోటిలపై కుల వివక్షతో దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని మధుబాబు కోరారు. కార్యక్రమంలో జిల్లా జైభీమ్ సేన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చూచుకొండ డ్వాక్రా మహిళల సమస్య పరిష్కరించాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి



మాట్లాడుతున్న వరలక్ష్మి

అనకాపల్లి: మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక దొడ్డి రామనాయుడు భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చూచుకొండ గ్రామంలో డ్వాక్రా మహిళల సమస్యలపై 20 రోజుల క్రితం వెలుగు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కరించడంలో విఫలమైనట్లు పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపులో ప్రతి నెలా వాయిదాలు సకాలంలో కట్టలేని ఇద్దరు మహిళలని పిలిపించి సమస్య పరిష్కరిస్తానని చెప్పిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు తులసి, బొడ్డే దివ్య, కాండ్రేగుల లక్ష్మి, కాండ్రేగుల కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా జలగల మదుం జంక్షన్



జలగల మదుం జంక్షన్‌లో రాళ్లు తేలిన రహదారి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని జలగల మదుం జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ మలుపులు తిరగాలంటే సాహసమే చేయాలి. అదృష్టం బాగుంటే ప్రయాణం కొనసాగుతోంది. లేకుంటే గాయాలు పాలై ఆస్పత్రికి వెళ్లాల్సిందే. నిత్యం రద్దీగా ఉండే జంక్షన్‌లో సమీపంలో కళాశాల విద్యార్థులు బస్సులు, ఆటోలు ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. అనకాపల్లి నుంచి విశాఖపట్నం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ఇక్కడ జంక్షన్‌లో మలుపు తిరుగుతుంటారు. వివిధ రాష్ట్రాలకు ప్రయాణించే లారీలు మలుపు తిరుగుతుంటాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన డివైడర్ దిమ్మలు అస్తవ్యస్తంగా, మరికొన్నిటికి ఊచలు పైకి తేలి ఉన్నాయి. మలుపు తిరిగే చోట రోడ్డుపై పిక్కలు తేలి ఉన్నాయి. రాత్రిళ్లు ఈ ప్రాంతంలో లైట్లు వెలగడం లేదు. దీంతో ఇటు ప్రయాణికులు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఇకనైనా జంక్షన్‌లో డివైడర్లు సరిచేసి దెబ్బతిన్న రోడ్లను బాగు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



జంక్షన్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డివైడర్ దిమ్మలు

నాటకాలకు పూర్వ వైభవం రావాలి



పెద్దలకు మాత్రమే నాటికలోని సరదా సన్నివేశం

అనకాపల్లి టౌన్: నాటకాలకు పూర్వవైభవం రావాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. పట్టణంలోని రైతు భారతిలో ఉగాది సందర్భంగా శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో, డైమండ్ హిట్స్ సహకారంతో నాటక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న పోటీలలో కాకినాడ మూర్తి కల్చరల్ అసోసియేషన్ వారిచే ఆకెళ్ల రచించిన పెద్దలకు మాత్రమే, సహ ప్రయాణం నాటికలను ప్రదర్శించారు.

మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక మళ్లీ వాయిదా

మునగపాక: స్థానిక మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ పదవి ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, ఈవోపీఆర్డీ ఎం.సోమరాజు తెలిపారు. సభ్యులెవరూ హాజరుకాక పోవడంతో ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా వేశామన్నారు. ఈ నెల 27న సభ్యులెవరూ ఉప సర్పంచ్ ఎన్నికలో పాల్గొనేందుకు రాకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం కూడా సభ్యులు హాజరు కాకపోవడంతో డీపీవో శిరీషారాణి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

వైభవంగా నూకాంబిక అమ్మవారి జాతర



అమ్మవారి ఆలయం వద్ద కోలాటం



ఎన్టీఆర్ స్టేడియంలో సాంస్కృతిక ప్రదర్శన



మహిళల కోలాటాల ప్రదర్శన



కశింకోటలో నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని తాకాశీవీధి నూకాంబిక అమ్మవారి జాతర శుక్రవారం ప్రారంభమైంది. వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాటు చేశారు.

కొత్త అమావాస్య ఉత్సవాలకు ఏర్పాట్లు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కొత్త అమావాస్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, నరసింగబిల్లి గ్రామాల్లో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచి కుంకుమ పూజలు, భక్తులకు దర్శనాలు కల్పించడానికి ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆలయాల వద్ద జరిగే జాతరలో అగ్ని గుండాలు తొక్కుట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించి ముస్తాబు చేశారు.

కశింకోట: కొత్త అమావాస్య పురస్కరించుకొని స్థానిక నూకాంబిక ఆలయాన్ని శుక్రవారం భక్తులు ఎక్కువగా దర్శించారు. అమ్మవారిని పూలమాలలు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చీరలు, రవికెలు, అరటి గెలలు వగైరా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెలమ, దేవాంగుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో గ్రామం నుంచి శివారులో వెలసిన అమ్మవారి ఆలయం వరకు వేర్వేరుగా సారె ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల తీపి, కారం పిండి వంటలు, అరటి గెలలు, పండ్లు వగైరా పళ్లెల్లో పట్టుకొని డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా చేరారు. అమ్మవారికి సారె నివేదించి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఆలయం వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర ఊరేగింపు గ్రామ వీధుల్లో జరిగింది. దారి పొడవునా ప్రజలు అమ్మవారి గరగలను దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్దకు ఊరేగింపు చేరాక భక్తులు అగ్ని గుండాలు తొక్కారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. భజన చేశారు. శని, ఆదివారాల్లోనూ ఉత్సవాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. నూతలగుంటపాలెంలో నూకాంబిక ఆలయాన్ని భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అగ్ని గుండాలు తొక్కారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కలిగెట్ల నాయుడు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



పులివేషం



నేల వేషం ప్రదర్శన